సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 14 । ఆగస్టు । 2023



ఈ క్రాప్ చేయించుకో..

రైతులు ఈ క్రాప్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయంటున్నారు.

- 8లో



విహంగాల ఆగమనం

తేలుకుంచిలో సైబీరియా పక్షులు సందడి చేస్తున్నాయి. చెట్లపై ఇప్పుడూ ఇల్లు కట్టుకుంటున్నాయి.

- 8లో

అమ్మవారి ఆలయంలో రూ. 8 లక్షలతో పనులు

పాతపట్నం: పాతపట్నం శ్రీ నీలమణి దుర్గ ఆలయంలో సుమారు రూ.8 లక్షలతో అమ్మవారి అద్దాల మండపం ముందు నూతనంగా రేకుల పెడ్లు, ఫ్లోర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన సొంత డబ్బుతో ఈ పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం రెకుల షెడ్ నిర్మాణం పూర్తయ్యిందని, ఇంకా కింద ఫ్లోరింగ్ నిర్మాణం చేపడతామని తెలిపారు.

న్యూస్‌రీల్

ఓటర్ల సర్వే పరిశీలన



కొల్లివలసలో ఓటరు జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీ కేష్ బి.లాఠకర్

బూర్జ: ఓటర్ల జాబితా విచారణ ప్రక్రియలో ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొల్లివలస గ్రామంలో పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్‌ఓలు చేస్తున్న ఓటర్ల జాబితా సర్వేను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈనెల 18 నాటికి సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని తెలిపారు. అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన, బోగస్ ఓట్లు ఉన్నట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎన్నికల ఉపతహసీల్దార్ మురళీధర్ నాయక్, మండల సర్వేయర్ గణపతిరావు, పంచాయతీ కార్యదర్శి రాజారావు, వీఆర్వోలు హేమ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో అధిక శ్రావణ సందడి



ఆదిత్యుని జ్ఞాపికను అందుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ అధికారి హరిత

అరసవల్లి: అధిక శ్రావణ ఆదివారం సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. స్వామికి తమ మొక్కులు చెల్లించుకుని దర్శనాలకు విశిష్ట, ప్రత్యేక, ఉచిత దర్శనాల మార్గాల్లో దర్శనాలకు వెళ్లారు. కొందరు భక్తులు కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించగా.. మరికొందరు సూర్యనమస్కార పూజలు చేయించుకుని గోధుమలు, ధాన్యం, పటిక, బెల్లం, ఖర్జూరం తదితర వస్తువులను దానం చేశారు. అంతరాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణతో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను కూడా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రూ.500 విశిష్ట దర్శనాలతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనాలతో పాటు రూ.300తో ఆలయ మండపాల్లోని సూర్యనమస్కార పూజలకు ఎగ్జిట్ ద్వారం నుంచి ప్రత్యేకంగా అనుమతివ్వడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి కె. హరిత కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఆదివారం రోజున దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,36,400, విరాళాల ద్వారా రూ.93,051, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.01 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలియజేశారు.

పాముకాటుతో ఉద్యోగి మృతి



సోమేశ్వరరావు (ఫైల్)

పాతపట్నం:పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బొంగు సోమేశ్వరరావు (57) పాముకాటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఇంటింటి ఓటరు సర్వే ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆయన విధులు ముగించుకుని రాత్రి 7గంటలకు ఇంటికి వచ్చారు. మొదటి ఫ్లోర్‌లో మెట్లు ఎక్కుతుండగా కుడికాలిపై పాము కాటు వేసింది. దీంతో కుటుంబసభ్యులకు విషయం చెప్పి కిందకు పడిపోయారు. కుటుంబ సభ్యులు 108 సాయంతో పాతపట్నం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. మృతుడికి భార్య సుశీల, కుమార్తెలు నీలిమ, పద్మినిలు, కుమారుడు వెంకటసాయిలు ఉన్నారు.

సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదన

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా టెక్కలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ, నందిగాం పోలీస్‌స్టేషన్లను కలిపి కొత్తగా టెక్కలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని కోటబొమ్మాళి పీఎస్‌లో ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.

రిమ్‌జిమ్ రిమ్‌జిమ్ సిక్కోలు



కలకాలం ఆనందంగా జీవించాలంటే ముందు ఆరోగ్యంగా ఉండాలి. శరీరాన్ని తేలిక చేసే, మనసును ప్రశాంతంగా ఉంచే వ్యాయామం చేయాలి. కానీ నేటి బిజీ జీవనశైలి అందుకు అవకాశం ఇవ్వడం లేదు. దానికితోడు మారిన మన ఆహార అలవాట్లు శరీరాన్ని మితిమీరిన కొవ్వు తదితరాలతో చెత్తబుట్టలా మార్చేస్తున్నాయి. ఫలితంగా అనేక రుగ్మతలు మనల్ని బలహీనంగా, రోగగ్రస్తుల్లా చేస్తున్నాయి. వీటి బారి నుంచి తప్పించుకోవాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాల్సిందే. కానీ డబ్బులు చెల్లించి జిమ్ (వ్యాయామ శాల)లకు వెళ్లడం అందరికీ సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీకాకుళం నగరపాలక సంస్థ పార్కులనే ఓపెన్ జిమ్ లుగా మార్చింది. హాయిగా ప్రకృతి ఒడిలో ఉచితంగా వ్యాయామం చేసుకునే వెసులుబాటు కల్పించింది. – శ్రీకాకుళం డెస్క్

- శ్రీకాకుళంలోని ఆరు పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- రూ.అరకోటి వరకు వ్యయం
- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- మరిన్ని ఏర్పాటు చేయాలంటున్న సిక్కోలు వాసులు



పీఎన్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న మహిళలు

ఓపెన్ జిమ్‌లు ఎందుకు..?

మారిన జీవనశైలితో వ్యాయామం తప్పని సరి అనే పరిస్థితి వచ్చింది. వ్యాయామ పరికరాలు కొనుగోలు చేసే శక్తి ఉన్నా వాటిని వినియోగించుకునేంత స్థలం ఇళ్లలో ఉండకపోవడం.. ఒకటికి మించి పరికరాల్ని ఇళ్లలో ఉంచుకునే సదుపాయం లేకపోవడం.. జిమ్‌లకు వెళ్లేంత సమయం ఉండకపోవడం.. వంటి కారణాలే ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రధాన కారణమని శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ఓబులేసు తెలిపారు.

నగర వాసులు ఏం కోరుకుంటున్నారు..?

ఓపెన్ జిమ్‌ల వద్ద పరికరాల వినియోగాన్ని వాటి ఉపయోగాల్ని వివరించేందుకు ఫిట్‌నెస్ ట్రైనర్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, స్వచ్ఛందంగా సేవలందించే వారెవరైనా ఉదయం, సాయంత్రం వేళల్లో అందుబాటులో ఉంచాలనేది నగరవాసులు మాట.



జీవన శైలిని బట్టి వ్యాయామం..



వ్యాయామం చేసే వ్యక్తి వయసు, ఆరోగ్యం, జీవనశైలి, ఆహార నియమాల ప్రకారం వ్యాయామ పరికరాల్ని ఎంచుకోవాలి. నిపుణుల పర్యవేక్షణలో చేస్తే మంచి ఫలితాలు సాధించొచ్చు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ఉపయోగకరం.

– పి.వేణుగోపాల రావు, గోపాల్ ఫిట్‌నెస్ యజమాని.

మంచి ఏర్పాటు..



ప్రశాంత వాతావరణంలో పచ్చని ప్రకృతి మధ్య రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేయడం చాలా బాగుంది. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా నగరవాసి కోసం ఇలాంటి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కృషి ప్రశంసనీయం.

–భాస్కరరావు, శ్రీకాకుళం

ఓపెన్ జిమ్‌ల సంఖ్య పెంచాలి..



రెండు పూటలూ వ్యాయామం కోసం పార్కుకు వెళుతుంటా. అన్ని శరీర భాగాలకు అవసరమైన వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. అదే జిమ్‌లకు వెళ్లి చేయాలంటే బోలెడు వ్యయప్రయాసలు తప్పవు. ఓపెన్ జిమ్‌ల సంఖ్య పెంచాలి.

– పి.ఈశ్వరరావు, శ్రీకాకుళం



ఓపెన్ ఎయిర్ జిమ్‌లు నగరంలో ఎక్కడెక్కడ: కార్గిల్ పార్క్, అబ్దుల్‌కలామ్ పార్క్,, పీఎన్‌కాలనీ పార్క్, ఎల్‌బీఎస్‌కాలనీ పార్క్, కొత్తపేట పార్క్, శాంతినగర్ పార్క్.

ఏర్పాటుకు వ్యయం ఎంత: ఆరు పార్కుల్లో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసేందుకు రూ.అరకోటికి పైగానే వెచ్చించారు. నాగావళి రివర్ వ్యూ పార్క్‌కు తప్ప ఇతర ఏ పార్క్‌లో వ్యాయామ పరికరాలు వినియోగించుకునేందుకు రుసుము చెల్లించనక్కర్లేదు.



వేళలు: ఉదయం 6గంటల నుంచి 10 గంటల వరకు
సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు

నగరవాసి ఆరోగ్య భాగ్యమే మా ఆనందం..



మంత్రి ధర్మాన ప్రసాద రావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచనలతో నగరంలోని ఆరు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశాం. వయసుతో సంబంధం లేకుండా వీటిని వినియోగించుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వ్యాయామం చేసేందుకు జిమ్‌లకు వెళితే ప్రతి నెలా వేలల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నగర వాసికి వ్యయప్రయాసలు లేకుండా ఉండేందుకే ఈ పరికరాలను ఏర్పాటు చేశాం. నగరవాసి ఆరోగ్యమే మా ధ్యేయం.

– ఓబులేసు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

ఏయే పరికరాలు- వినియోగం ఎలా..

నగరంలో పార్కుల విస్తీర్ణం.. అక్కడ సదుపాయాలను బట్టి ఓపెన్ జిమ్‌ల్లో 6 నుంచి 10 పరికరాలు ఏర్పాటు చేశారు. వాటి వినియోగం.. ఏఏ భాగాల మీద ప్రభావం.. ఎంత సేపు చేయాలి అనే అంశాల్ని ఫిట్‌నెస్ నిపుణులు ఇలా వివరించారు.

ఛాతి, వీపు భాగం..



15 మూవ్‌మెంట్స్ చొప్పున గ్యాప్ ఇవ్వాలి. ఇలా నాలుగు సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

స్టెప్పర్ సైక్లింగ్



శరీరం అంతటికీ సంబంధించిన పరికరం. 15 నిమిషాలు నుంచి 20 నిమిషాల వరకు చేస్తే సరిపోతుంది.

భుజాలకు..



15 మూవ్‌మెంట్స్ చొప్పున గ్యాప్ ఇవ్వాలి. ఇలా నాలుగు సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇది చేస్తే భుజాలకు చాలా మంచిది.

పొట్ట కండరాలు..



15 నుంచి 20 వరకు మూవ్‌మెంట్స్ చేసి గ్యాప్ ఇవ్వాలి. ఇలా నాలుగు సార్లు చేస్తే మంచి ఫలితం.

కాళ్లకు సంబంధించి..



15 మూవ్‌మెంట్స్ చొప్పున గ్యాప్ ఇవ్వాలి. ఇలా నాలుగు సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

నడుం భాగం..



20 మూవ్‌మెంట్స్ చేసి గ్యాప్ ఇవ్వాలి. ఇలా నాలుగు సార్లు చేస్తే సరిపోతుంది.

ఫ్లాగ్ కోడ్ తెలుసా..?



శ్రీకాకుళం న్యూకాలనీ: పంద్రాగస్టు వేడుకల సందర్భంగా వాడవాడలా మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కేంద్రం పిలుపునిచ్చింది. ముఖ్యంగా ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు దేశ ప్రజలంతా తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. అయితే జాతీయ జెండాను ఎగురవేయడానికి కొన్ని నియమాలు ఉన్నాయి. ఆ ఫ్లాగ్ కోడ్ ఏమిటో తెలుసుకుందాం.

ఫ్లాగ్ కోడ్ అంటే ఏమిటి ?

- జాతీయజెండాను ఎగురవేయడానికి ప్రతి ఒక్కరూ ఫ్లాగ్ కోడ్ 2002ను అనుసరించాల్సి ఉంది.
- అలాగే యాంటీ డిఫమేషన్ ఆఫ్ నేషనల్ సింబల్స్ యాక్ట్–1971 నిబంధనలను కూడా పాటించాల్సి ఉంటుంది.
- ఈ కోడ్‌లోని నిబంధన 2.1 ప్రకారం, జాతీయ జెండాపై పూర్తి గౌరవంతో సాధారణ పౌరులు ఏ ప్రదేశంలోనైనా జెండాను ఎగురవేయవచ్చు. దీనిపై ఎలాంటి నిషేధం లేదు.
- అయితే జాతీయ జెండాను అవమానిస్తే మొదటి తప్పునకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే నిబంధన ఉంది.
- 2002 జనవరి 26న కొత్త కోడ్ అమల్లోకి వచ్చింది. అంతకు ముందు నేషనల్ సింబల్స్ అండ్ నేమ్స్ యాక్ట్–1950, యాంటీ డిఫమేషన్ ఆఫ్ నేషనల్ సింబల్స్ యాక్ట్–1971 ఉండేవి. ఇటీవల ఈ కోడ్‌లో రెండు ప్రధాన మార్పులు చేశారు.
- 2022 జూలై 20న చేసిన సవరణ ప్రకారం, ఇప్పుడు జాతీయ జెండాను పగలు, రాత్రి కూడా ఎగురవేయవచ్చు. అది బహిరంగ ప్రదేశమైనా, ఇంటి మీదైనా ఎగరేయడానికి అనుమతి ఉంది.
- అంతకు ముందు జాతీయ జెండాను సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మాత్రమే ఎగురవేయడానికి అనుమతి ఉండేది.
- జాతీయ జెండాను పాలిస్టర్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేయడానికి 2021 డిసెంబర్ 30 నుంచి అనుమతించారు. గతంలో ఖాదీ వస్త్రంతో మాత్రమే జాతీయ జెండా తయారీకి అనుమతి ఉండేది.

ఇవి గుర్తుంచుకోండి

ప్రభుత్వ ఫ్లాగ్ కోడ్ గతంలో చాలా కఠినంగా ఉండేది. ఇప్పుడు దానిని సరళీకృతం చేశారు. అయినా సరే, జాతీయ జెండాను ఎగురవేసేటప్పుడు తప్పనిసరిగా కొన్ని నియమాలు, పద్ధతులు గుర్తుంచుకోవాలి.

- జెండాను ఎగరేసేటప్పుడు అది చిరిగిపోయి ఉండకూడదు. నలిగిపోయిన, తిరగబడిన జెండాను ఎగరవేయరాదు. సరైన స్థలంలోనే జెండాను ఎగరేయాలి.
- జాతీయ జెండాను ఎగరేసే ఎత్తులో లేదా అంత కంటే ఎక్కువ ఎత్తులో మరే ఇతర జెండా ఎగురవేయకూడదు.
- జెండాను ఎలాంటి అలంకరణలకు ఉపయోగించకూడదు.
- జెండాను ఎగుర వేసేటప్పుడు, కాషాయ రంగు పైకి ఉండేలా జాగ్రత్త వహించాలి.
- జెండాపై ఏమీ రాయకూడదు. ఏ వస్తువు మీద కప్పడానికి జెండాను ఉపయోగించకూడదు.
- జెండాను ఎగురవేయడానికి సిద్ధం చేస్తున్నప్పుడు, అవసరమైతే కొన్ని పువ్వులు అందులో ఉంచవచ్చు.
- జాతీయ జెండా నేల మీద పడేయకూడదు, నీటిపై తేలనీయకూడదు.
- జెండాను దుస్తులుగా కుట్టించుకోకూడదు. నడుము కింది భాగంలో చుట్టుకోకూడదు. రుమాలుగా, సోఫా కవర్‌గా, న్యాప్‌కిన్‌గా, లోదుస్తుల తయారీకి ఉపయోగించకూడదు.
- జెండాను ఎగురవేసేటప్పుడు, అది ధ్వజస్తంభానికి కుడి వైపున ఉండాలి.
- ధ్వజస్తంభం మీద లేదా జెండాపైన పూలు, ఆకులు, దండలు పెట్టకూడదు.

స్వాతంత్య్ర వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



వేడుకల కోసం ప్రధాన వేదిక వద్ద షామియానా ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న స్వాతంత్య్ర వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరగనున్న జిల్లాస్థాయి వేడుకలకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. ప్రధాన వేదికతోపాటు వీఐపీలు, వీవీఐపీలు, ప్రెస్‌అండ్ మీడియా, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్య్ర సమరయోధులు, వీక్షకుల కోసం వేరువేరుగా షామియానాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. శకటాలు, స్టాళ్లు సిద్ధమవుతున్నాయి.



సన్నద్ధమవుతున్న శకటాలు

ఇంటింటా జాతీయ జెండా ఎగరేద్దాం: కలెక్టర్



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇల్లు, కార్యాలయాలపై జాతీయ జెండాలను ఆవిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ 2.0లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు జాతీయ జెండాలను చెల్లింపు ప్రాతిపదికన పౌరులకు పంపిణీ చేసే బాధ్యతను తపాలా శాఖ చేపట్టిందన్నారు. 20X30 సైజు గల జాతీయ జెండా గ్రామ స్థాయి బ్రాంచ్ పోస్టాఫీసులతో సహా ప్రతి పోస్టాఫీసులో రూ.25కు అందుబాటులో ఉంచిందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో 10 వేల జెండాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

రహదారిపై నెత్తుటి మరక

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- మృతుల్లో ఒకరు పూజారి, మరొకరు వంట మాస్టర్

శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస:

రహదారి రక్తసిక్తమైంది. స్నేహితుడిని ఆస్పత్రికి తీసుకెళ్దామని బయల్దేరిన వారిని మృత్యువు మింగేసింది. శ్రీకాకుళంలోని ఆదివారంపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమదాలవలస మోణంగివారి వీధికి చెందిన మండా జగన్(27), పూజారిపేటకు చెందిన నాయుడు సత్యనారాయణ(42)లు దుర్మరణం పాలయ్యారు. శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఇచ్చిన వివరాల మేరకు..

జగన్ అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. సత్యనారాయణ వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్నేహితుడికి కడుపు నొప్పిగా ఉండడంతో ఆస్పత్రికి తీసుకెళ్దామని ఆయనను అంబులెన్స్‌లో ఎక్కించి.. వెనుక బండిపై మరో ముగ్గురు బయల్దేరారు. ఆదివారంపేట సప్తగిరి కల్యాణ మండపం దగ్గరకు రాగానే.. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రూట్ గుండా వెళ్లే మరో ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో జగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో కన్ను మూశాడు. అదే బండిపై ఉన్న మరో వ్యక్తి ఈశ్వరరావుకు గాయాలయ్యాయి.

అలాగే మరో వాహనంపై ఉన్న లంకాం గ్రామానికి చెందిన రుప్ప జయరాం, రాజు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో జయరాం పరిస్థితి విషమంగా ఉంది.

కుటుంబాల్లో విషాదం..

మృతుల్లో మండ జగన్‌కు తండ్రి లేరు. తల్లి, చెల్లి మాత్రమే ఉన్నారు. ఆమదాలవలసలోని అయ్యప్ప స్వామి ఆలయంలో పూజారిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మరో మృతుడు సత్యనారాయణకు వివాహమైనా విడాకులు కావడంతో తల్లి వద్దే ఉంటున్నాడు. ఈయన వంట మాస్టర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబాన్ని పోషించే ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు మృత దేహాలను రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదుచేశారు. మృతుల కుటుంబ సభ్యులు రిమ్స్ వద్దకు చేరుకున్నారు. వారి రోదనలు ఆపడం ఎవరి తరం కాలేదు. కుటుంబ సభ్యుల ఆవేదన చూసి అక్కడున్న వారు కూడా కంటతడి పెట్టుకున్నారు.



రక్తసిక్తమైన ప్రమాద స్థలం



మండా జగన్ (ఫైల్)



సత్యనారాయణ (ఫైల్)

క్లుప్తంగా

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

బొబ్బిలి: పట్టణంలోని పాత కోర్టు భవనం ఎదురుగా ఉన్న సామిల్లులో పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లా పాలవలసకు చెందిన దుమ్ము దుర్వాసులు(58) నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. దుర్వాసులు ఎనిమిది నెలలుగా ఇక్కడ పనిచేస్తూ సహచరులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గాలికోసం సమీపంలో గల నిర్మాణ భవనం పైకి వెళ్లగా ప్రమాదవశాత్తు తూలి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి ముగ్గురు మగ పిల్ల లున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

శ్రీకాకుళం చేరిన రాజీవ్ జ్యోతియాత్ర

శ్రీకాకుళం అర్బన్: దేశంలో శాంతి స్థాపన కోసమే రాజీవ్ జ్యోతియాత్ర నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ తమిళనాడు నాయకుడు శామ్యూల్ ది రవియమ్ అన్నారు. ఈ నెల 11న తమిళనాడు శ్రీ పెరుంబుదూరులో బయల్దేరిన రాజీవ్ గాంధీ జ్యోతి యాత్ర ఆదివారం శ్రీకాకుళం నగరానికి ఆదివారం ఉదయం చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, స్థానిక కాంగ్రెస్ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి



స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జడ్జి దంపతులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని ఆదివారం ఎస్సీ, ఎస్టీ కోర్టు జిల్లా జడ్జి సింగులూరి మహేందర్ ఫణికుమార్ దంపతులు దర్శించుకున్నారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి ఏకవార అభిషేకాలు, అర్చనలు, దర్శనాలు చేయించారు. అనంతరం వారిహి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి అర్చకులు స్వామివారి చరిత్రతోపాటు ఆలయ విశేషాలు వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించి పుణ్యాహ వచనాలతో దీవించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికులు

కవిటి: స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం ఆవరణలో శనివారం రాత్రి ముక్కి లలిత అనే అనాథ మహిళ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే మృతురాలి బంధువులకు సమాచారం తెలిపారు. వారి నుంచి స్పందన రాకపోవడంతో స్థానికులు ఆలోచించి అంత్యక్రియలు చేసేందుకు నిర్ణయించారు. మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ కొంత ఆర్థిక సాయం అందించి స్థానిక పారిశుద్ధ్య కార్మికుల సాయాన్ని తీసుకొని చివరి కార్యక్రమాలు జరిపించారు. పోలీసు సిబ్బంది కూడా సహకరించారు.

రాష్ట్ర మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఇషా ప్రతిభ



ప్రశంసాపత్రంతో ఇషాప్రకృతి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ స్కే చాంపియన్‌షిప్ పోటీల్లో పలాసకు చెందిన బందావు ఇషా ప్రకృతి సత్తాచాటింది. ఆదివారం శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ హాల్‌లో జరిగిన రాష్ట్ర మాస్టర్ ఆర్ట్స్ స్కే పోటీల్లో ఆమె రజత పతకంతో మెరిసింది. విశాఖలోని విజ్ఞాన్ విహార్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న ఇషా విశాఖ తరుపున ప్రాతినిధ్యం వహించి ఈ ఫీట్ సాధించింది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

రైతన్నా మేలుకో.. ఈక్రాప్ చేయించుకో..

- పక్కాగా సాగు లెక్కకు చర్యలు
- రైతులు ముందుకు రావాలంటున్న అధికారులు
- ఈక్రాప్ నమోదుతోనే ప్రభుత్వ పథకాల వర్తింపు



సత్యవరంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏలు

నరసన్నపేట: రైతు పక్షపాతిగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అందరి మన్ననలు పొందుతోంది. అన్నదాతకు ఏకష్టం వచ్చినా ఆదుకునేలా అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇందులో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ఒకటి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. విత్తు నుంచి ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అమ్ముకునే వరకూ అన్ని విధాల రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దీంట్లో భాగంగా మూడు సంవత్సరాలుగా అమలు చేస్తున్న ఈక్రాప్ నమోదు సత్ఫలితాలను ఇస్తోంది. గత ఏడాది నుంచి ఈక్రాప్ నమోదు ప్రాధాన్యతను రైతులు గుర్తించారు. ఈ ఖరీఫ్‌లో మరింత సమర్థవంతంగా.. రైతు ప్రయోజనాలే లక్ష్యంగా దీనిని అమలు చేయడానికి వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. సకాలంలో క్రాప్ బుకింగ్ పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు దృష్టిసారించారు. రెండు రోజుల క్రితం నుంచి ఈ క్రాప్ నమోదు ప్రారంభమైంది. సిబ్బందికి కూడా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు మండలాల వారీగా నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,37,152 ఎకరాల్లో వివిధ పంటలు ఈ ఖరీఫ్‌లో సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఈ క్రాప్ నమోదు చేయాల్సి ఉంటుంది.

క్రాప్ బుకింగ్ యాప్‌లో పూర్తి వివరాలు

వీఏఏలు క్షేత్ర స్థాయిలో పొలం వద్దకు వెళ్లి ఆయా రైతులు సాగు చేస్తున్న పంట ఫొటోలు తీసి, పంట విస్తీర్ణం, విత్తిన/ నాట్లు వేసిన తేదీ, పంట పేరు తదితర వివరాలను క్రాప్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే నంబర్లు వారీగా అధికారుల పర్యటనలన్నింటినీ జియో ట్యాగింగ్ చేస్తారు. కచ్చితమైన వివరాలు లెక్కించేందుకు రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ నుంచి శాటిలైట్ సహాయంతో ఇమేజెస్ రూపంలో చిత్రీకరించేందుకు యాప్ దోహదపడుతుంది.

ఈ క్రాప్ నమోదు ఇలా..

ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన వివిధ పంటల వివరాలను గ్రామాల వారీగా ఆర్‌బీకేలోని అగ్రికల్చరల్ అసిస్టెంటు (వీఏఏ) వరి నాట్లు వేసిన తర్వాత, సాగులో ఉన్న పొలం వద్దనే వివరాలు సేకరిస్తారు. రైతు ఎంత విస్తీర్ణంలో పంట వేశారనే వివరాలు నమోదు చేస్తారు. వరితో పాటు ఇతర రకాల పంటలను నమోదు చేస్తారు. పొలం వద్దనే రైతుకు ఫొటో తీసి వెబ్‌ల్యాండ్‌లో పొందుపరుస్తారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నమోదు చేస్తున్నారు. ఈక్రాప్‌లో నమోదైన పంటల సాగు వివరాలను మండల స్థాయిలో తహసీల్దార్, వ్యవసాయాధికారి, జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించి తుది జాబితాలను ఆర్బీకేల వద్ద ప్రదర్శిస్తారు. రైతుల అభ్యంతరాల మేరకు జాబితాను సవరిస్తారు.

ఈ క్రాప్‌తో ప్రయోజనాలు..

ఈక్రాప్‌లో పంట వివరాలను నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం రైతులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది. తక్కువ ధరకే మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తారు. వ్యవసాయ యంత్ర పరికరాలు భారీ రాయితీలతో సమకూర్చుతుంది. ఏదైన కారణాలతో పంటకు నష్టం వాటిల్లితే బీమా వర్తిస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ సమకూరుతుంది. పంటను కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈక్రాప్ నమోదు కాని విస్తీర్ణంలో పంటలను అధికారికంగా అమ్ముకునేందుకు రైతులకు వీలు కాదు. దీంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకోవాల్సి ఉంటుంది. రైతులు ఈ-క్రాప్ ప్రయోజనాన్ని గుర్తించి నమోదుకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ఖరీఫ్‌లో పంటల వివరాలు (హెక్టార్లలో)	
వరి	1,59,500
మొక్కజొన్న	10,550
రాగి	58
కంది	134
పెసలు	101
మినుగులు	109
వేరుశనగ	533
పత్తి	1,848
చెరకు	1,820

సకాలంలో ఈ క్రాప్ నమోదు



జిల్లా వ్యాప్తంగా పంటల నమోదు ప్రక్రియ ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రారంభమైంది. వీఏఏలు బాధ్యతగా సంబంధిత వీఆర్వోల సహకారంతో ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలి. దీనికోసం రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. ఉభాలు ప్రారంభమైన నేపథ్యంలో ఈక్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి. ఈక్రాప్ నమోదు వల్ల చేకూరే ప్రయోజనాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన వచ్చింది.

– శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ, శ్రీకాకుళం

రక్తదానం మహాదానం



మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

● రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం మహాదానమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీధర్మశాస్తా సన్నిధానం ట్రస్ట్ సౌజన్యంతో బరాటం సంతోష్ గురుస్వామి, వారి శిష్యబృందం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళంలోని పాతబస్టాండ్ వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదాతల ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. సన్నిధానం గురుస్వాములు, అయ్యప్పలు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. శ్రీధర్మశాస్తా ట్రస్ట్ నిర్వాహకుడు బరాటం సంతోష్ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన అయ్యప్పలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా 400 యూనిట్ల రక్తదానం సేకరించామన్నారు. సేకరించిన ఈ రక్తం యూనిట్‌లను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, న్యూ బ్లడ్‌బ్యాంక్ సొసైటీ, లయన్స్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం, రాగోలులోని జెమ్స్ ఆస్పత్రి, సీఎస్‌వి బ్లడ్ బ్యాంక్ వారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, వైఎస్సార్‌సీపీ నేతలు అంధవరపు సూరిబాబు, ఎంవీ పద్మావతి, పైడిశెట్టి జయంతి, కోణార్క్ శ్రీను, హారికా ప్రసాద్, ఊన్న నాగరాజు, గురుస్వాములు, అయ్యప్పలు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న ధర్మాన ప్రసాదరావు

మాస్టారు మాకు ఆదర్శం: మంత్రి సీదిరి



పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, పిరియా రాజారావు

సోంపేట: మామిడిపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు, యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పాతిన కృష్ణమూర్తి మాస్టారు తమవంటి వారికి ఆదర్శమని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మామిడిపల్లి గ్రామంలో పాతిన కృష్ణమూర్తి మాస్టారు జీవితం ఆధారంగా రచించిన 'ఉద్యమ పథంలో నా జ్ఞాపకాలు' పుస్తకాన్ని మంత్రి ఆదివారం ఆవిష్కరించారు. మాస్టారు మామిడిపల్లి గ్రామాభివృద్ధికి, ఉద్దానం ప్రజల సమస్యల కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ పిరియా రాజారావు మాట్లాడుతూ ఆయన జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాతిన కృష్ణమూర్తి, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, మామిడి కోదండరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏపీఎల్ రన్ ర్యాలీ



ఏపీఎల్-2కు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘ ప్రతినిధులు, క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో ఏపీఎల్ రన్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఏపీఎల్-2 రెండో సీజన్ మొదలుకానున్న విషయం తెలిసిందే. ఈ మెగా టోర్నీకి సంఘీభావంగా ఏసీఏ ఆదేశాల మేరకు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రన్ శ్రీకాకుళంలో ఉత్సాహంగా జరిగింది. స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వద్ద మొదలైన ఈ ర్యాలీ పాలకొండ రోడ్, డే అండ్ నైట్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వరకు సాగింది. క్రికెట్ సంఘ జిల్లా అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజ షేక్‌తో కలిసి తొలుత క్రీడా జ్యోతిని వెలగించి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఐపీఎల్‌కు ఎంపిక కావడమే లక్ష్యంగా ఆడాలని సూచించారు. మ్యాచ్‌లను తిలకించేందుకు ఫ్రీ టిక్కెట్లను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. క్రికెటర్లను మరింతగా ప్రోత్సహించేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో పాత్రునివలసలో క్రికెట్ స్టేడియం, ఆర్ట్స్ కళాశాల మైదానంకు ఎంఓయూ పూర్తిచేసి, టర్ఫ్ వికెట్ వేయబోతున్నట్టు వెటరన్ క్రికెటర్ ఇలియాస్ మహ్మద్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘ కౌన్సిలర్ డాక్టర్ ఎస్.రవికుమార్, ఉపాధ్యక్షుడు బాలమురళీకృష్ణ, కోశాధికారి కేఎస్ మదీనాశైలానీ, ఇతర ప్రతినిధులు, కోచ్‌లు, అఫీషియల్స్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం జిల్లా మహిళా విభాగం ప్రతినిధుల ఎంపిక

శ్రీకాకుళం కల్చరల్: ఆర్య వైశ్య సంఘం మహిళా విభాగం జిల్లా నాయకులుగా ముగ్గురు మహిళలు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంఘ ప్రతినిధులు ప్రకటించారు. జిల్లాకు సంబంధించి అధ్యక్షురాలిగా చేబోలు మణి, కార్యదర్శిగా పేర్ల అరుణ, ట్రెజరర్‌గా కృష్ణకుమారిలను ఎంపిక చేశారు. ఈ మేరకు వారికి ధృవపత్రాలను పంపారు.

ఆకట్టుకున్న జాతీయ జెండా ర్యాలీ



టెక్కలిలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆదివారం నిర్వహించిన జాతీయ జెండా ర్యాలీ ఆకట్టుకుంది. సుమారు 75 అడుగుల జాతీయ జెండాతో పట్టణంలో పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

15 అంగుళాల పొడవుతో..

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన కంచు, ఇత్తడి కార్మికుడు, సూక్ష్మ కళాకారుడు కింతాడ బుజ్జిబాబు 15 అంగుళాల కంచు, ఇత్తడితో జాతీయ జెండాను తయారు చేశారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15 అంగుళాల పొడవు గల స్థూపంతో కూడిన జాతీయ జెండాను ఆయన ఆదివారం తయారు చేశారు.



కంచు, ఇత్తడితో తయారు చేసిన జాతీయ జెండా

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



గాలిలో కాల్పులు చేస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ సూరాడ రామారావు(53) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళంలో గల జెమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈయన బెంగళూరులో విధులు నిర్వహించేవారు. కొత్తపేట సముద్ర తీరంలో తండ్రి కృష్ణమూర్తి జవాన్ చితికి నిప్పంటించారు. శ్రీకాకుళం ఏఆర్ పోలీసులు జవాన్ మృతదేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవవందనం చేశారు. రామారావు 30 ఏళ్లుగా వివిధ హోదాల్లో దేశానికి సేవలు అందించారు. మృతుని భార్య ఇటీవల మృతి చెందింది. అర్జు, రమ్య అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియలకు గాను ప్రభుత్వం రూ. 50 వేలు అందించింది.

అత్యవసర వేళ..

కోటబొమ్మాళి: ప్రసవ వేదనతో బాధపడుతున్న ఒక గోవును 1962 పశువుల అంబులెన్స్ కాపాడింది. సారవకోట మండలం కొమ్మువలస గ్రామానికి చెందిన బొనే సూర్యనారాయణకు చెందిన ఆవు ఆదివారం ప్రసవ వేదనతో బాధ పడుతుండడంతో సూర్యనారాయణ స్థానిక పశు వైద్యుడిని సంప్రదించారు. అయితే కడుపులో దూడ అడ్డం తిరగడంతో వెంటనే 1962 పశువుల అంబులెన్స్‌ను సంప్రదించారు. వారు వెంటనే వచ్చి ఆవును కోటబొమ్మాళి వెటర్నరీ ఆస్పత్రికి తెచ్చారు. పశువైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్ ఆవుకు ఆపరేషన్ చేసి దూడను బయటకు తీసి కాపాడారు.

సారవకోట ఎంపీడీఓ మృతి



ఎంపీడీఓ విశ్వేశ్వరరావు

సారవకోట: మండల ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న విశ్వేశ్వరరావు(53) ఆదివారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయనకు మూ డు రోజుల కిందట గుండె నొప్పి వచ్చింది. శనివారం చికిత్స కోసం జెమ్స్‌లో చేర్పించగా ఆదివారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఎంపీడీఓ మృతిపై నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, జెడ్పీటీసీ వరుదు నాగేశ్వరి, మండలంలోని పలువురు సర్పంచ్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

రహదారులు, భవనాల శాఖ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం: జిల్లా రహదారులు, భవనాల శాఖ వర్క్ చార్టర్డ్ ఉద్యోగుల బ్రాంచి సంఘానికి ఆదివారం శ్రీకాకుళంలోని రహదారులు, భవనాల శాఖ సంఘ కార్యాలయంలో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ కార్యవర్గ ఎన్నికలకు ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.పోతురాజు, ఎన్నికల అధికారులుగా పి.శ్రీనివాసరావు, ఎస్.వేణులు హాజరయ్యారు. సంఘం అధ్యక్షునిగా మురళీ పాణిగ్రాహి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రామారావు, ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



జిల్లా రహదారులు, భవనాలశాఖ వర్క్ చార్టర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

● విహంగాల ఆగమనం



ఇచ్ఛాపురం రూరల్: వేల కిలోమీటర్ల దూరం నుంచి సైబీరియా పక్షులు తేలుకుంచి చేరుకుంటున్నాయి. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు చిత్రవిచిత్రమైన చప్పుళ్లు చేస్తూ చెట్లపై గూళ్లు నిర్మించుకుంటున్నాయి. ఈ పక్షుల సందడితో తేలుకుంచి పులకించిపోతోంది.